కథానిక

# కొత్తగాలి

## శ్రీ మధుర్‌జీ

సరిగ్గా సంవత్సరం క్రితం.

ఆరోజు కూడా ఆగష్టు పదిహేనే -

ఎలిమెంటరీ స్కూళ్ళపిల్లలతో నాలుగు జెండాపాటలు పాడించి-పప్పులూ, బెల్లాలు సంతర్పణ జరిపేరోజు

అధికారులు, అనధికారులు, నాయకులు మంత్రులు మహాశయులుముక్తకంఠంతో అమాయకులను ఉపన్యాసాల వెల్లువల్లో ముంచి, వాగ్దానాల మత్తులో తేలియాడించేరోజు.

అవును. అది ఆగష్టు పదిహేనే

ఉదయం ఆరుగంటలకింకా అయిదు నిమిషాలు తక్కువగానే వుంది.

పోలీసు రామయ్య గేటు మీద చెయ్యి వెయ్యగానే సీమకుక్క 'గయ్'మంటూ విరుచుకు పడింది. పోలీసురామయ్యను రోజు చూస్తున్నా -చూసిన ప్రతిసారి ఆ సీమకుక్క అలా 'గయ్' మంటూ రామయ్య మీద దూకుతునే వుంటుంది 'అయ్యో! ఇదేమిటి ఈ కుక్కకు కూడా లోకువై పోతున్నానే'-అంటూ రామయ్య మనసులోనే అనుకుంటూ వుంటాడు.

ఆ కుక్క ఆయింటి తాలూకు యజమానిది.

ఆ యజమాని పోలీసురామయ్య పని చేస్తున్న స్టేషన్-సర్కిల్ ఇన్‌స్పెక్టరు, ఆరడుగుల ఎత్తు- ఎనభై కేజీలబరువు వున్న ఆ సర్కిల్ కళ్లలో బక్క జీవుల పైన అకారణమైన ఆగ్రహము నిర్లక్ష్యము తప్ప మరేమీ వుండవు. ఆయన ముందు నుంచున్నంత సేపు పోలీసులు ఊపిరి కూడా సరిగా పీల్చుకోరన్నా అతిశయోక్తి కాదు. పై ఆఫీసర్లు వచ్చినప్పుడు వారిపట్ల సర్కిల్ కనబరుస్తున్న భక్తిప్రపత్తులు చూచి పోలీసులు ఆశ్చర్య పోతుంటారు. ఇక నాయకులో వినాయకులో వస్తే చెప్పనక్కరలేదు.

'ఎవరూ'?-లోపలనుండి అమ్మగారి గొంతు మనిషిపైకి ఎంత అందంగా కన్పిస్తుందో -మనసులో అంత రాక్షసి. ఎప్పుడో ఓ పోలీసు మల్లెపూలు తేవటం కాస్త ఆలస్యమయిందని అతన్ని సీమ కుక్క చేత కసిదీరా కరిపించింది కుక్కను ఒళ్లోకూర్చోబెట్టుకొని మనుషుల్ని పురుగులకన్నా హీనంగా చూస్తుంది

'నేనండి అమ్మగారు ! రామయ్యని' -గొంతు నిండా వినయం.

'ఓహ్! ఇప్పుడా రావటం -అప్పుడే సిక్స్'గట్టిగా విసుక్కుంటోంది బెడ్‌రూములో నుంచే అయ్యగారు ఎక్కడలేస్తారోనని రామయ్య గుండె గొంతులో కొట్టుకుంటోంది.....

'చూడూ! ఇవాళ యిండిపెండెన్సుడే కదా! నాకూఅయ్యగారికి బోలెడన్ని యెంగేజిమెంట్సున్నాయి. బాత్‌రూములో నీళ్లు పడేసి-మార్కెట్ కెళ్లి కూరగాయలు తెచ్చి వంటమనిషి కిచ్చి-బాబును త్వరగా

రడీ చేసి స్కూలు దగ్గర విడిచిరా!...
ఆమె అలా చెప్తూనే టూనే పోతుంది. సడన్‌గా ఆపి-కిటికీలోనుండి రామయ్యను పురుగును చూచినట్లు అసహ్యంగా చూస్తూ ఏం! అలా నుంచున్నావ్ కొయ్యబొమ్మలా. ఛీ! డర్టీ ఫూల్! కొంచం కూడ యాక్టివ్‌నెస్ లేదు- అంటూ అవులించింది.

రామయ్య తలవంచుకొని బి దెతీసుక వెళ్ళాడు. ఉదయం వాతావరణంలో గాలి మౌనంగా వుంది. ఆకులు కూడ కదలటానికి భయపడుతున్నాయి. పోలీసు రామయ్య మనసులాగే వాతావరణం కూడ నిర్వేదంగా వుంది.

పని....పని....పని

గడియారం ఎనిమిది గంటలు కొట్టే దాక రామయ్య యంత్రం లాగ అటూ యిటూ పరుగెత్తుతునే వున్నాడు.

అయ్యగారి మోటర్ బైక్ గర్వంగా వెళ్ళిపోయింది.

చిన్నబాబు సీట్‌గా తయారై వచ్చాడు.

ముచ్చటగా, ముద్దుగా, ముట్టుకుంటే నే కందిపోయేలా - ఖరీదుగా, హుషారుగా వున్నాడు

పోలీసు రామయ్యను వేలితో చూపిస్తూ ఆరేళ్ళ అందాల చినబాబు మమ్మీ చెవులో రహస్యంగా ఏమో చెప్పాడు.

అంతే! మమ్మీ, చినబాబు పగలబడి నవ్వారు.

యాభై ఏళ్ళ రామయ్య తల వంచుకు నిలబడ్డాడు.

'బాబును రిక్షాలో జాగ్రత్తగా తీసికెళ్ళు' - ఆర్డర్

'అలాగే నండమ్మగారు'-వినయం.
రామయ్య, చినబాబు వెళ్ళిపోయారు.

చినబాబును చూస్తుంటే పోలీసు రామయ్యకు సూరిగాడు మదిలో మెదిలాడు.

సూరిగాడు - సూర్యం - రామయ్య ఆఖరి కొడుకు.

పదమూడేళ్ళ వయసున్నా పదేళ్ళ అర్భకుని లాగానే వుంటాడు.

కళ్లల్లో దైన్యం తప్ప ఉత్సాహం వుండదు. చిరిగిన బట్టతో చింపిరి తలతో ఏదో పోగొట్టుకున్నట్లుంటాడు. ఇవ్వాల్టి స్వాతంత్ర్య దినోత్సవానికి మాష్టారు తెల్లచొక్కా- చిరుగులు లేనిది తొడుక్కు రమ్మన్నాడని-దానికోసం నిన్న సాయింత్రం నుండి ఏడుస్తూనే వున్నాడు. తల్లి మాత్రం ఏం చేస్తుంది-తన అసహనాన్ని పిల్లవాడి వీపుమీద ప్రదర్శించటం తప్ప.

ఇంట్లో పొయ్యి మీదకు, పొయ్యి కిందకు ఏమీ లేవని ఇల్లాలు ఆరోపణ.

వానకు ఎండకు కూడ రక్షణ యివ్వలేని వరండాలో కుక్కి మంచంలో రామయ్య ముసలి తల్లి- మందులు లేవన్న ఫిర్యాదు-
పురిటికి వచ్చిన పెద్ద ఆడకూతురు-

కాలేజి ఫీజులకు భయపడి ఆ చదువుకి దూరమై-ఏడవ తరగతి చదువుతోనే వుద్యోగాల వేటలో పడక తప్పని పెద్ద పిల్లవానికి యింటర్వ్యూల ఖర్చులు.,

ఇంట్లో కాలుపెడితే జోరీగల్లా చుట్టుముట్టే సమస్యలు....

ఈ సమస్యలన్నిటికీ కావలసింది ఒక్కటే.

పోలీసు రామయ్య లాటి వ్యక్తుల దగ్గర కూడ లేనిది ఒక్కటే.

డబ్బు .. డబ్బు .. .డబ్బు

చిన బాబును పాలరాతి భవనం లాటి కాన్వెంటు ముందు జాగ్రత్తగా దింపాడు — కన్న కొడుకులను కూడా ఎన్నడూ బడిదగ్గర దిగబెట్టటానికి తీరిక లేని పోలీసు రామయ్య.

స్కూలు గడియారం తొమ్మిది కొట్టింది.

రామయ్య గుండెలు భయంతో కొట్టుకున్నాయి.

తొమ్మిదిన్నరకు గ్రౌండ్స్‌లో 'మాస్ పేరేడ్' వుంది.

డి.యస్.పి. గారు పర్యవేక్షిస్తారు. సర్కిల్ మనుష్యుల్ని (సాదా) పురుగుల్లాగా చూస్తే, డియస్పీగారు ఈ అలగా నాయాళ్ళి బూట్ క్రింద వేసి రాయాలంటాడు' మరో మెట్టుపై నున్నాడు కదామరి!

రామయ్య పరుగులాటి నడకతో రెండు కిలోమీటర్ల దూరమున్న పోలీసు క్వార్టర్స్ అనబడే గూటిని చేరి-జీవితంలో మొదటిసారిగా ఈ వుద్యోగంలో చేరినపుడు - భవిష్యత్తును బంగారంగా వూహించుకుంటూతొడుక్కున్న యూనిఫారం —యాంత్రికంగా వేసుకొని గ్రౌండ్‌కు పరుగుతీశాడు పెరేడ్‌కు.

అప్పటికే పెరేడు జరుగుతోంది.

రామయ్య గుండెలు భయంతో గుబగుబలాడాయి. డియస్పి - వేషంతో వున్న పులిలావుంటే, ప్రక్కనున్న సర్కిల్ చిన్నతోడేలులా వున్నాడు

'అరే బేవ్‌కూఫ్ ఇలారా'-డియస్పి గర్జించాడు. రామయ్య కాళ్లు, చేతులు వణుకుతున్నాయి. వినయంగా, అత్యంత దీనంగా "సెల్యూట్ చేసి నుంచున్నాడు.

'ఏరా గాడిదకొడకా! యిందిపె దెన్నడే పెరేడ్‌కు లేట్‌గావస్తావురా రాస్కెల్. కడుపుకు ఏంతిన్నావురా? కుక్కా ఇంట్లో పెళ్ళాంకి కల్లు పిసుకుతున్నావురా 'ఈ లక్ష్మి కొడుకుల్ని బూట్‌తో తన్ని చెప్పాల ...'

సర్కిల్ గంభీరంగా వున్నాడు

మిగతాపోలీసులు మౌనంగావున్నారు. వారూ యిలాంటి "సన్మానాలు" ఎన్నో చేయించుకోక తప్పింది కాదు.

'ఇంతదాక నీ ప్రక్కన గంభీరంగా నుంచున్నాడే - ఆ గాడిద యింటో గాడిద చాకిరి చేసివచ్చానురా' - ఈ జవాబు రామయ్య గుండెల్లోనే ఖూనీ చేయబడింది.

'పోరా లక్ష్మి కొడుకా - గన్ ఎత్తుకొని ఈ గ్రౌండ్‌లో ఫోర్‌రౌండ్స్ కొట్టు' - డియస్పి గర్జించాడు.

పోలీసు రామయ్య తుపాకి ఎత్తుకొని పరుగెత్తాడు.

x x x x

మళ్లీ అగష్టు పదిహేను.

సర్కిల్ యింటో చిందులేస్తున్నాడు. ఆరుదాటి ఏడైనా ఏ పోలీసు చాకిరీకి రాలేదు. ఇంటో నీళ్ళులేవు. కూరగాయలు లేవు. అమ్మగారు చికాకు పడుతున్నారు. పెళ్ళాంముందు తన పరువు పోతున్నందుకు సర్కిల్‌కు తలకొట్టేసినట్లుగా వుంది, చినబాబు. కాన్వెంట్‌కు పోవాలని తొందర పడేకొద్దీ అమ్మగారికి చికాకు పెరిగిపోతుంది.

సర్కిల్‌గారు కోపంగా స్టేషను చేరుకున్నాడు. ఎవ్వరూ వంగి వంగి

దండాలు పెట్టలేదు-యాంత్రికంగా విష్ చేయడంతప్ప పెరేడ్ తర్వాత డిన్నరుంది. డిన్నరు అరేంజ్ మెంట్లు-ఒక్కొక్కటి ఒక్కో పోలీసుకు అప్పగించాడు. అయినా ఎవ్వరూ ఆ డిన్నరుగురించి పట్టించుకోలేదు

సర్కిల్ కు తలతిసినట్లుగా వుంది

డియస్పీ వచ్చాడు. పెరేడ్ జరిగింది కాని ఆ నవాయితీగా జరుగుతున్న డిన్నర్ లేదు. సర్కిల్ దీనంగా జరుగుతున్నది చెప్పాడు. గుండెల్లోని గుబులు కనపడనీయకుండా డియస్పీ - రామయ్యను, మరోయిద్దరి వెంటనే సస్పెండ్ చేయించాడు.

సాయంకాలమే పోలీసులు ఊరేగింపు తీశారు. స్టేషనుబయట యింతవరకూ తమకేం పట్టనట్లుగా నుంచున్న చెటు కొత్తగాలికి తీవ్రంగా కదిలాయి.

—ooo—

# సమాధి చేసేయ్!

అడుగు ముందుకు పడ్తుందంటే - మన
గడువు చేరువవుతుందనే అర్థం
ఆ లోపుగా మనం
అనుభవించింది
వ్యథలను-బాధలను
గాధలుగా సృష్టించు కోవడమే.
ఈ వ్యవస్థ మారనంతవరకు
మన అవస్థల ఫైళ్ళు పెరుగుతూనే ఉంటాయి.
ఫైళ్ళను చూస్తూ వేళ్ళను లెక్క పెత్తే
నీళ్ళు కారిపోతుంది బ్రతుకు-
బ్రతుకు బాటలో ఇక పన్నీటి జల్లుపడదు
ఎంతవద్దను కున్నా ఊటలా వచ్చే కన్నీటి జల్లు ఆగదు

—తమాటం లక్ష్మణగౌడ్.